సాక్షి కుమురం భీం

బుధవారం ¦ 6 ¦ డిసెంబర్ ¦ 2023



బాలికల ఆరోగ్యానికి భరోసా ఏది?
కేజీబీవీల్లో ఆరోగ్య కిట్ల పంపిణీపై గందరగోళం నెలకొంది. ఈఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటికీ అందజేయలేదు. 8లో▸



అటకెక్కిన 'అనుసంధానం'
సాగు భారం నానాటికీ పెరుగుతోంది. వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేయాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
24.2 / 15.6

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావంతో బలమైన గాలులు వీస్తాయి. జిల్లా అంతటా మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కార్తికేయ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన దుర్గం కార్తికేయ రాష్ట్రస్థాయి అండర్– 17 పాఠశాలల క్రీడల ఫెడరేషన్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్ తెలిపారు. ఈ నెల 2న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో కార్తికేయ ఉత్తమ ప్రతిభ చూపారని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీ నట్ల శంకర్, పీఈటీ యాదగిరి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సాంబశివరావ్, క్రికెట్ అకాడమీ కోచ్ ఆచార్య విష్ణుకాంత్, అధ్యాపకులు కోసరి మహేష్‌చంద్ర తదితరులు కార్తికేయను అభినందించారు.

బీఆర్‌ఎస్ అధినేతను కలిసిన కోవ లక్ష్మి



కేసీఆర్‌తో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన కోవ లక్ష్మి మంగళవారం ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించిన కోవ లక్ష్మిని కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన సీపీఐ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజార్టీ సాధించిన నేపథ్యంలో సీపీఐ నాయకులు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో సీపీఐ జాతీయ నాయకులతోపాటు జిల్లా ఇన్‌చార్జి కలవేణి శంకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం



పూజలు చేస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు

సిర్పూర్(టి): సిర్పూర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టోంకిని గ్రామస్తులు, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతుతూ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తాండూరు నుంచి నాగ్‌పూర్ వరకు నాలుగు లైన్ల రహదారి పనులకు కేంద్ర మంత్రులతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ నీరటి రేఖ, నాయకులు నాని, సత్యనారాయణ, విలాస్, అశోక్, బనార్కర్ సాయి, మహేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వైద్యసేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు విస్తరించాలని డీఎంహెచ్‌వో తుకారాం భట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో వైద్యాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రోగ్రాం అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ, డీఎంఅండ్‌హెచ్‌వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్, వైద్యులు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎమ్మెల్యేలపై కోటి ఆశలు!

- ఉమ్మడి జిల్లాలో సమస్యలు అనేకం
- చొరవతోనే అభివృద్ధి వేగం
- హామీల అమలుపైనే అందరి దృష్టి



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్త ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో శాసనసభ్యుల పాత్ర కీలకం. కొత్తగా ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల చొరవే ఆ ప్రాంత అభివృద్ధిపై ఆధారపడనుంది. నియోజకవర్గాలకు నిధుల విడుదల, సద్వినియోగం తదితరాలన్నీ సమగ్రంగా సాగితేనే వచ్చే ఐదేళ్లు సాఫీగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఏ పని చేయాలన్నా, అధికారులు, ప్రజల ప్రతినిధిగా ఎంతో నిబద్ధతతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో పది మంది ఎమ్మెల్యేలు తమ బాధ్యతను నెరవేర్చాల్సి ఉంటుంది. తమ ప్రాంత ప్రజల ఆశయాలు తీర్చేందుకు చట్ట సభలో గొంతెత్తాల్సి ఉంటుంది. శాసనాల రూపకల్పనలో ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలి. అడవుల జిల్లాగా ఉన్న ఈ ప్రాంతంలో మిగతా జిల్లాలతో పోలిస్తే ఇంకా వెనకబాటే కనిపిస్తోంది. కొత్త ప్రభుత్వంలో మరింత అభివృద్ధి సాగాలని ఇక్కడి వారంతా కోరుకుంటున్నారు.

ఏజెన్సీలో తీరని సమస్యలు..
గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ రోడ్ల సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. చాలాచోట్ల అటవీ అనుమతులు రాక కొత్త రోడ్లకు మోక్షం కలగడం లేదు. ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత, ఆసుపత్రిల్లో వైద్య సిబ్బంది లేమితో విద్య, వైద్యం అందని ద్రాక్షగానే మారింది. పీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సరిపడా ఉండడం లేదు. ముఖ్యంగా స్పెషలిస్టు వైద్యులు లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. జిల్లా ఆసుపత్రుల్లోనూ ఇంకా వైద్య సౌకర్యాలు మెరుగుపడాల్సి ఉంది.

తీరని సాగునీటి గోస

ఉమ్మడి జిల్లాలో నేటికి సాగునీటి గోస తీరలేదు. ఇప్పటికీ వర్షాధారంతో పత్తి, ఆరుతడి పంటలపైనే ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల రైతంగం ఆధారపడుతున్నారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు అటకెక్కడంతో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచి ర్యాల జిల్లాలకు ప్రత్యామ్నాయంగా సాగునీటి ప్రాజెక్టులే లేకుండా పోయింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ప్రాణహిత, గోదావరి తీర ప్రాంతాలకు వరదముంపు తప్పడం లేదు. ఆదిలాబాద్ నియోజకవర్గపరిధిలో చనాఖా కొరటా నిర్మాణం, ఖానాపూర్ నియోజకవర్గంలో కడెం ప్రాజెక్టు ఆధునికీకరణ, మంచిర్యాల జిల్లాలో గూడెం ఎత్తిపోతలు, ఆసిఫాబాద్‌లో కుమురంభీం, పెద్దవాగు, వట్టివాగు ఆధునికీకరణలు, సిర్పూర్‌లో జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు, నిర్మల్ నియోజకవర్గంలో సరస్వతీ కాలువ ఆధునికీకరణ పూర్తి చేయాల్సి ఉంది.

ఉపాధి పెరగాలి

సహజ వనరులు, ముడిసరుకు లభ్యత ఉన్నా ఫ్యాక్టరీలు, కొత్త కంపెనీల స్థాపన అందని ద్రాక్షగానే మారింది. మంచిర్యాల, ఆసిఫా బాద్ పరిధిలోని ప్రభుత్వ రంగసంస్థ సింగరేణిలో కొత్తగనుల ప్రారంభం, ఉద్యోగాల కల్పన మెరుగుపడాల్సి ఉంది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల పట్టణాల్లో పరిశ్రమల స్థాపనకు ఊతమివ్వాలి. ఆదిలాబాద్, మంచిర్యాలలో ఐటీ హబ్‌ల ఏర్పాటు వేగవంతం చేయాల్సి ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పలు పరిశ్రమలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు, ఐటీ హబ్‌లు, నైపుణ్య శిక్షణ సంస్థలు, స్వయం ఉపాధి కల్పనకు కృషి చేయాల్సి ఉంది. యువతకు ప్రోత్సాహం అందించాల్సి ఉంటుంది.

పట్టణాలపై దృష్టి పెట్టాలి

నియోజకవర్గ కేంద్రాలు, పట్టణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. ఇక్కడే జనాభా అధికంగా నివసిస్తుండడంతో మున్సిపాలిటీల అభివృద్ధిపై రూట్‌మ్యాప్‌తో ముందుకెళ్లాలి. చాలా చోట్ల అభివృద్ధి మొదలైనప్పటికీ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. కొత్త మున్సిపాలిటీల పరిస్థితి ఇంకా మెరుగుపడడం లేదు. తాగునీరు, నాలాలు, ఆక్రమణలు, జంక్షన్లు, ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయి. వ్యాపారులు, వాణిజ్య ప్రక్రియ సాగేందుకు మరింత చొరవ చూపాల్సి ఉంది. రవాణా వేగం పెంచేందుకు రోడ్లు, రైల్వే మార్గాల్లో ప్రజలు అందుబాటులోకి తీసుకురావాలి. ఇక ప్రభుత్వ భూములు, ఆస్తుల రక్షణ కోసం కబ్జాలు, అవినీతి నిరోధించడం, జవాబుదారీ పాలన అందించేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చతికిలపడిన 'చేయి'!

- భారీగా తగ్గిన కాంగ్రెస్ ఓటుబ్యాంకు
- ఆసిఫాబాద్, సిర్పూర్ స్థానాల్లో కుదేలైన జాతీయ పార్టీ
- రెండుచోట్లా అభ్యర్థుల వైఖరిపై ఓటరు వ్యతిరేకత
- సిర్పూర్‌లో కనీసం డిపాజిట్ తెచ్చుకోలేని స్థితి



సాక్షి, ఆసిఫాబాద్: కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆ పార్టీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిగా కుదేలైపోయింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 10 సార్లు, సిర్పూర్‌లో ఐదు సార్లు హస్తం పార్టీ విజయం సాధించింది. 2018 ఎన్నికల్లోనూ ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి 65,788 ఓట్లు సాధించి గెలుపొందగా, సిర్పూర్‌లో 59,052 ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. అంతటి బలమైన ఓటుబ్యాంకు కలిగిన పార్టీ ఈ సారి జిల్లాలో రెండుచోట్లా ఓటమి పాలైంది.

విశ్వసించని జనం..
వాస్తవానికి రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీస్తున్నా.. కుమురం భీం జిల్లాలో మాత్రం పార్టీ తరఫున బరిలో నిలిచిన అభ్యర్థుల వైఖరిపై ఓటరు వ్యతిరేకత కనిపించినట్లు స్పష్టమవుతుంది. పార్టీ పరువు నిలబెట్టేందుకు కొంతమంది కాంగ్రెస్ నేతలు ఖర్చుకు కూడా వెనుకాడలేదు. క్యాడర్‌ను వెనక్కి రప్పించుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఇంత దారుణ పరాభవానికి అసలు కారణం.. పార్టీ అభ్యర్థులపై ప్రజలకున్న ఆగ్రహం అని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వచ్చిన ఓట్లు సైతం పార్టీ(హస్తం గుర్తు)ని చూసి వేసినవేనన్న వాదన ఉంది. సిర్పూర్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రావి శ్రీనివాస్‌కు కేవలం 8,427 ఓట్లు (4.51శాతం) పడ్డాయి. ఇక్కడ కనీసం డిపాజిట్ కూడా దక్కకపోవడంపై పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

సంప్రదాయ ఓటుబ్యాంకును కాపాడుకోలేక..
సామాజికవర్గ సమీకరణాల నేపథ్యంలో చతుర్ముఖ పోటీ ఉంటుందని అంచనా వేసినా.. అది త్రిముఖంగానే మిగిలిపోయింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతపై సరిగ్గా ప్రచారం చేసుకోలేకపోయారు. కనీసం సంప్రదాయ ఓటు బ్యాంకును సైతం కాపాడుకోలేకపోయారు. దీంతో నాలుగంకెల ఓట్లకే పరిమితమయ్యారు. కనీసం డిపాజిట్టు సైతం దక్కించుకోలేకపోయారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి హఠాత్తుగా కాంగ్రెస్ టికెట్టు తెచ్చుకున్న అజ్మీరా శ్యాంనాయక్ విజయం సాధించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి 83,052 ఓట్లు రాబట్టగా, కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్ 60,242 ఓట్లు సాధించారు. 22,810 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ వైఫల్యాలను శ్యాంనాయక్ తీవ్రస్థాయిలో ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. అయితే ఆయన రాకతో పార్టీలో వర్గపోరు మొదలైంది. చివరకు పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న సీనియర్ నేతలు కొందరు పార్టీ వీడితే... మరికొందరు అట్టిముట్టనట్టు వ్యవహరించారు. ఇంకొందరు పార్టీలోనే ఉంటూ చివరి క్షణంలో బీఆర్‌ఎస్ వైపు మొగ్గచూపినట్లు తెలుస్తోంది. అభ్యర్థి వైఖరి వల్లే వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి కారణాలతో పార్టీకి కంచుకోట లాంటి కొన్ని మండలాల్లో ఓట్లు చీలిపోయాయన్న వాదన ఉంది. ఆదివాసీల్లో కొందరు బీఆర్‌ఎస్ అభ్యర్థిపై వ్యతిరేకంగా ఉన్నప్పటికీ ఆ ఓట్లను తన వైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ అభ్యర్థి విఫలమయ్యారు. ప్రధానంగా గాదిగూడ, నార్నూర్, జైనూర్, సిర్పూర్(యూ), తిర్యాణి, వాంకిడి మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి బాగా వెనుకపడటం కూడా ఆయన ఓటమికి కారణమైంది. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన గోండు సామాజిక వర్గానికి చెందిన కోట్నాక విజయ్‌కుమార్ ఆదివాసీ ఓట్లను చీల్చగలిగారు. కోట్నాక విజయ్ సాధించిన 16 వేల పైచిలుకు ఓట్లు.. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిలో ప్రధాన భూమిక పోషించాయి. శ్యాంనాయక్‌కు పడ్డ ఓట్లు.. తన సామాజిక వర్గం, కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిమానం చూసి వేసినవేనన్న వాదన ఉంది. ఆసిఫాబాద్ పట్టణ, రూరల్ మండల ఓటర్లు బీఆర్‌ఎస్‌కు 50 శాతం ఓట్లు వేయకపోతే మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి విజయావకాశాలు మెరుగయ్యేవి.

ఘనంగా మృత్తిక దినోత్సవం

బెల్లంపల్లి: ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. నేల స్వభావాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. రాబోయే తరాలకు ఆహారాన్ని అందించడానికి ఆరోగ్యకరమైన నేలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగేశ్వర్‌రావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రియ సుగంధి, తిరుపతి, నాగరాజు, సతీష్‌కుమార్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రైతులు పాల్గొన్నారు.

కోవ లక్ష్మికి 'ఏజెన్సీ' అండ

- అన్ని మండలాల్లో బీఆర్‌ఎస్‌కే ఆధిక్యం
- సిర్పూర్(యూ)లో అత్యధికంగా 5,389 మెజార్టీ



విజయోత్సవ ర్యాలీలో కోవ లక్ష్మి (ఫైల్)

ఆసిఫాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగినా.. ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి వెన్నుదన్నుగా నిలిచారు. ముఖ్యంగా ఏజెన్సీ మండలాల్లో ఆమె స్పష్టమైన ఆధిక్యం సాధించారు. ఇక్కడి బీజేపీ, బీఎస్పీతోపాటు పలువురు స్వతంత్రులు బరిలో నిలిచినా ప్రభావం చూపలేకపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్ రెండోస్థానంలో నిలవగా.. బీజేపీ నుంచి టికెట్ ఆశించిన భంగపడిన గోండు సామాజిక వర్గానికి చెందిన కోట్నాక విజయ్ మాత్రమే ఇక్కడ చెప్పుకోదగ్గ స్థాయిలో ఓట్లు సాధించారు.

బీఆర్‌ఎస్‌కు 83,052 ఓట్లు..
ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మొత్తం 1,84,698 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి 83,052 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్ 60,242 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. కోవ లక్ష్మి 22,810 మెజార్టీతో విజయం సాధించారు. ఇక స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచిన కోట్నాక విజయ్ 16,469 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. నియోజకవర్గంలోని 9 మండలాల ఓటర్లు బీఆర్‌ఎస్‌కే పూర్తిగా మద్దతు ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 171 స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన కోవ లక్ష్మికి ఈసారి ప్రజలు పట్టం కట్టారు. ప్రధానంగా ఏజెన్సీలో వన్‌సైడ్ ఓటింగ్‌తో ఆమె విజయం నల్లేరు మీద నడకగా సాగింది.

సిర్పూర్(యూ)లో అధికం..
నియోజకవర్గంలో సిర్పూర్(యూ), గాదిగూడ, నార్నూర్, జైనూర్, కెరమెరి, లింగాపూర్, రెబ్బెన, వాంకిడిలో బీఆర్‌ఎస్‌కు స్పష్టమైన ఆధిక్యం లభించింది. కోవ లక్ష్మి సొంత మండలమైన తిర్యాణిలో మొత్తం 7,279 ఓట్లు సాధించారు. అయితే పట్టణ ఓటర్లు ఎక్కువగా ఉన్న జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లో మాత్రం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య పోటాపోటీ నడిచింది. కోవ లక్ష్మి ఇక్కడ కేవలం 33 ఓట్ల స్వల్ప మెజార్టీ దక్కించుకున్నారు. కోవ లక్ష్మి కుమార్తె కోవ అరుణ సిర్పూర్(యూ)లో గంపగుత్తగా ఓట్లు రాబట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ మండలంలో బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా 5,984 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు కేవలం 595 ఓట్లు మాత్రమే వచ్చాయి. నియోజకవర్గంలోనే అత్యధికంగా 5,389 ఓట్ల మెజార్టీ ఇక్కడే దక్కింది. గాదిగూడలో బీఆర్‌ఎస్‌కు 6,449 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 2,763 ఓట్లు వచ్చాయి. జైనూర్‌లో బీఆర్‌ఎస్‌కు 9,429, కాంగ్రెస్‌కు 4,783 ఓట్లు, కెరమెరిలో బీఆర్‌ఎస్‌కు 8,099, కాంగ్రెస్‌కు 7,505 ఓట్లు, లింగాపూర్‌లో బీఆర్‌ఎస్‌కు 4,427, కాంగ్రెస్‌కు 2,451 ఓట్లు వచ్చాయి. ఇక రెబ్బెనలో బీఆర్‌ఎస్ 10,710, కాంగ్రెస్ 9,957 ఓట్లు సాధించాయి. నార్నూర్‌లో బీఆర్‌ఎస్‌కు 6,444 మంది, కాంగ్రెస్‌కు 6,367 మంది ఓటేశారు. ఇక్కడ 77 ఓట్ల మెజార్టీ దక్కింది. తిర్యాణిలో బీఆర్‌ఎస్‌కు 7,279 మంది, కాంగ్రెస్‌కు 3,578 మంది, వాంకిడిలో బీఆర్‌ఎస్‌కు 9,523 మంది, కాంగ్రెస్‌కు 7,302 మంది ఓటేసి మద్దతు తెలిపారు.

ఆసిఫాబాద్‌లో పోటాపోటీ
ఆసిఫాబాద్ గ్రామీణంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నువ్వానేనా అన్న రీతిలో పోటీ పడ్డాయి. ఇక్కడ బీఆర్‌ఎస్‌కు కేవలం 33 ఓట్ల స్వల్ప మెజార్టీ దక్కింది. చిర్రకుంటలోని 5 పోలింగ్ కేంద్రాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హోరాహోరీగా తలపడ్డాయి. ఈ కేంద్రాల్లో బీఆర్‌ఎస్‌కు 1079 ఓట్లు, కాంగ్రెస్ 1087 ఓట్లు రావడంతో శ్యాంనాయక్‌కు 8 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇక జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్‌కు 33 ఓట్ల ఆధిక్యం దక్కింది. ఇదిలా ఉండగా పోస్టల్ బ్యాలెట్‌లో ఓటర్లు మాత్రం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. 1,179 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాంగ్రెస్‌కు 609, బీఆర్‌ఎస్‌కు 331, స్వతంత్ర అభ్యర్థి కోట్నాక విజయ్‌కుమార్‌కు 87 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 278 ఓట్ల మెజార్టీ దక్కింది.

ఆర్టీసీకి 'ఎన్నికల' ఆదాయం

- రాజకీయ సభలు, సమావేశాలకు ప్రత్యేక బస్సులు
- రెండు నెలల్లో సంస్థకు అదనపు రాబడి



జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్

ఆసిఫాబాద్‌అర్బన్: సుమారు రెండు నెలలపాటు సాగిన ఎన్నికల హడావుడి వివిధ వర్గాల ప్రజలకు ఉపాధి కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సభలు, సమావేశాలు, ప్రముఖుల పర్యటనలు.. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా సందడి కనిపించింది. ముఖ్యంగా ఈ ఎన్నికల వాతావరణం ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. మొదట ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలతో జిల్లాలో ప్రచారం ఊపందుకుంది. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వివిధ పార్టీలు ముఖ్య నేతల పర్యటనల సందర్భంగా నిర్వహించిన సభలకు ఆర్టీసీ బస్సులను విస్తృతంగా వినియోగించుకున్నాయి. అలాగే ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు, సామగ్రి రవాణా, ఇతర అవసరాల కోసం ఎన్నికల సంఘానికి సైతం ఆర్టీసీ సేవలందించింది. దీంతో జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ డిపోకు అదనపు ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

79 బస్సు సర్వీసులు
ఆసిఫాబాద్ డిపో పరిధిలోని మొత్తం 79 బస్సు సర్వీసులు నిత్యం సుమారు 30 వేల కిలోమీటర్ల దూరం తిరుగుతూ ప్రజలను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. సాధారణ రోజుల్లో రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల చొప్పున ఆదాయం సమకూరుతుంది. దసరా, సంక్రాంతి, దీపావళి తదితర పండుగల సమయంలో సంస్థ అదనపు సర్వీసులు నడపడం ద్వారా ఆదాయన్ని ఆర్జిస్తుంది. ఈ క్రమంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి నవంబర్ 30న ఎన్నికలు ముగిసే వరకు ఆర్టీసీ సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది.

ఆదాయం ఇలా..
అసెంబ్లీ ఎన్నికల ఎన్నికల నిర్వహణ కోసం నవంబర్ 29న డిపోకు చెందిన 47 సర్వీసులు కేటాయించారు. అలాగే ఎన్నికల రోజు 30వ తేదీన 32 సర్వీసులు వినియోగించారు. డిపోకు నవంబర్ 29న రూ.2,35,000 అదనంగా ఆదాయం సమకూరగా, 30వ తేదీన 32 సర్వీసులకు రూ.లక్షా 60వేల వరకు ఆదాయం వచ్చింది. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి బందోబస్తు కోసం వచ్చిన పోలీసు బలగాల కోసం మరో ఐదు ప్రత్యేక సర్వీసులు వినియోగించారు. ఇందుకు ఒక్కో సర్వీసుకు రూ.48వేల అద్దె వసూలు చేశారు. సాధారణ రోజుల్లో ఒక సర్వీసు సుమారుగా రూ.15వేల వరకు ఆదాయం రాగా, ఎన్నికల నిర్వహణ కోసం ప్రతీ సర్వీసుకు రూ.20వేలు అద్దెకు వచ్చారు. ఈ రకంగా అదనంగా ఒక్కో సర్వీసుపై రూ.5వేల ఆదాయం సమకూరింది. అలాగే ఎన్నికలకు ముందు వివిధ రాజకీయ పార్టీల బహిరంగ సభలకు జనసమీకరణ కోసం ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 40, బెల్లంపల్లి నియోజకవర్గానికి 40 బస్సులు అద్దెకు కేటాయించారు. ఒక్కో బస్సుకు రూ.18వేలు అద్దె రూపంలో డిపోకు లబ్ధి చేకూరింది. చెన్నూర్ సభకు 39 బస్సు సర్వీసులను కేటాయించగా ఒక్కో సర్వీసుకు రూ.22వేలు అద్దె రూపంలో వచ్చింది. కాగా ప్రైవేటు సభలకు కేటాయించిన సర్వీసులను బస్ ఆన్ కాంట్రాక్ట్ పద్ధతిన అద్దె రూపంలో కేటాయిస్తామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

డిపోలో బస్సు సర్వీసులు

పల్లె వెలుగు 57
రాజధాని 02, సూపర్ లగ్జరీ 14,
డీలక్స్ 02, ఎక్స్‌ప్రెస్‌లు 04,
మొత్తం 79

రెండు నెలల్లో ఆదాయం

నెల	ఆదాయం
అక్టోబర్	రూ.4.35 కోట్లు
నవంబర్	రూ.4.30 కోట్లు

సమష్టి కృషితోనే..
ఎన్నికల సమయంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ఆర్టీసీ కార్మికులు, అధికారులకు అభినందనలు. అందరి సమష్టి కృషితోనే సంస్థకు అదనపు ఆదాయం సమకూరింది. ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి.
– శ్రీధర్, డిపో మేనేజర్, ఆసిఫాబాద్

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఆర్.రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆమె కార్యాలయం నుంచి మంగళవారం పదో తరగతి సబ్జెక్టుల ఉపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ జారీ చేసిన పదో తరగతి వంద రోజుల ప్రత్యేక కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎస్‌ఏ వన్ పరీక్షల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయా విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని సబ్జెక్టు పరంగా సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. రోజువారీగా స్లిప్ టెస్టులు నిర్వహించి పరీక్షా పత్రాలను మూల్యాంకనం చేయాలని సూచించారు. వంద రోజుల ప్రణాళిక అమలుపై ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవోలు క్షేత్రయ్య, హుస్సేన్, పురుషోత్తం, జీసీడీవో శకుంతల, క్రీడల అధికారి మీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోనియాగాంధీని కలిసిన వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన పోటీ చేసి ఎమ్మెల్యేగా వినోద్ ఎన్నికయ్యారు. ఎన్నికల్లో తనకు పోటీ చేసే అవకాశం కల్పించిన సోనియాగాంధీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జోనల్‌స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో అండర్-17 బాలికల జోనల్ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల జట్లు ఉదయం 10 గంటల్లోగా రిపోర్టు చేసేలా సంబంధిత జిల్లాల పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శులు సహకరించాలని సూచించారు. ఇతర వివరాలకు గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డిని 9440010453, హ్యాండ్ బాల్ క్రీడా శిక్షకుడు చునార్కర్ అరవింద్‌ను 9550909870 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితమే లాభాల వాటా

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు హక్కులు సాధించింది ఏఐటీయూసీ మాత్రమేనని ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నెరువెట్ల మల్లేశ్ అన్నారు. మంగళవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ ఇప్పించింది, లాభాల్లో వాటా హక్కు కూడా తమ యూనియన్ పోరాట ఫలితమేనన్నారు. ఇంకా కార్మికులకు అనేక హక్కులు సాధించామన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపిస్తే మరిన్ని హక్కులు, సదుపాయాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ ఏరియా సెక్రటరీ మారేపల్లి సారయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ప్రతాప్, నాయకులు రమేశ్, బానేష్, వెంకటేష్, మహేందర్, జితేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని యువతి వేడుకోలు


మాట్లాడుతున్న శరణ్య

నస్పూర్(మంచిర్యాల): తన భర్త వద్దకు తనను చేర్చి న్యాయం చేయాలని ఓ యువతి వేడుకుంటోంది. మంగళవారం విలేకరుల సమావేశంలో తన గోడు వెల్లబోసుకుంది. బాధిత యువతి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన శరణ్య నాగార్జునకాలనీకి చెందిన పెండ్యాల వినోద్ 2017 నుంచి ప్రేమించుకున్నారు. 2021లో వినోద్‌కు సింగరేణిలో ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి శరణ్యను దూరం పెడుతూ వచ్చాడు. పెళ్లికి నిరాకరించడంతో తనకు జరిగిన అన్యాయాన్ని శ్రీరాంపూర్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. ఇరువురికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో ఆగస్టు 31, 2022న జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. రెణ్నెళ్ల తర్వాత తీసుకెళ్తానని చెప్పి యువతి తల్లిగారింట్లో దింపి వెళ్లిపోయాడు. ఆ తర్వాత తీసుకెళ్లమని అడిగితే నిరాకరించాడు. దీంతో అతని ఇంటి ఎదుట బైటాయించి నిరసన తెలుపగా యువకుడి తల్లి కొట్టి అక్కడినుంచి పంపించి వేసింది. మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్, సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మరోపెళ్లి చేసుకోవాలని చూస్తున్నాడని, తన భర్త వద్దకు చేర్చి తనకు న్యాయం చేయాలని శరణ్య వేడుకుంటోంది.

బాలికల ఆరోగ్యానికి భరోసా ఏది?

- పంపిణీకి నోచుకోని కాస్మొటిక్ కిట్లు
- ఖాతాల దశలోనే నిలిచిన నగదు జమ
- విద్యార్థినులకు తప్పని ఎదురుచూపులు



ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	కేజీబీవీలు	విద్యార్థులు
ఆదిలాబాద్	17	4,080
మంచిర్యాల	18	3,435
నిర్మల్	19	5,787
కుమురంభీం	15	3,690

మంచిర్యాలఅర్బన్: బాలికా విద్యను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థినులకు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని పంపిణీ చేస్తున్న ఆరోగ్య కిట్ల పంపిణీపై గందరగోళం నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమి, పేదరికం వల్ల ఎంతోమంది విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా పరిశుభ్రత కిట్ల (కాస్మొటిక్ కిట్లు) పంపిణీ చేపట్టింది. కరోనాతో నేపథ్యంలో రెండేళ్లపాటు కిట్లు పంపిణీ చేయలేదు. ఆ తర్వాత కాలంలో మూణ్నెళ్లకోసారి ఇస్తూ వస్తున్నా ఎనలేని జాప్యం నెలకొంది. గతేడాది ఆరోగ్య కిట్ల స్థానంలో నగదు పంపిణీ చేసేందుకు విద్యార్థినుల చేత బ్యాంకులో ఖాతాలు తెరిపించారు. అటూ ఆరోగ్యకిట్లు.. ఇటు నగదు చెల్లింపులపై ఎటూ తేల్చకుండా పోయింది. ఈఏడాది విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరునెలలు పూర్తికావస్తున్నా ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంతో బాలికలకు ఎదురుచూపులు తప్పడంలేదు.

కస్తూరిబాలో అధికారుల తనిఖీ

జన్నారం: మండలంలోని కస్తూరిబా పాఠశాలలో మంగళవారం అధికారులు ప్యానల్ తనిఖీలు చేశారు. అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో 14 మంది సభ్యులు అడ్మినిస్ట్రేటివ్, అకాడమీకి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థినులపై తీసుకునే జాగ్రత్తలు వివరించారు. హాస్టల్ నిర్వహణపై పలు అంశాలను సూచించారు. సమావేశంలో పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీవాణి, అకౌంటెంట్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న అధికారులు

ఆరోగ్యకిట్లు ఇలా..

కేజీబీవీలో ఆరు నుంచి (ఆదర్శ పాఠశాలలో ఏడు నుంచి) ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినులకు ఆరోగ్య కిట్లు అందజేస్తున్నారు. సర్కారు పాఠశాలలో ఉచిత విద్యాబోధన.. పాఠ్యపుస్తకాలు.. రెండు జతల యూనిఫాంతో పాటు మధ్యాహ్నం భోజనం వంటి కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం 2017–18 విద్యాసంవత్సరం నుంచి బాలికల ఆరోగ్యానికి భరోసా నిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పేదింటి ఆడపిల్లలకు విద్యతో పాటు ఆరోగ్య కిట్లను పంపిణీ చేస్తూ వచ్చారు. మొదట మంచిర్యాల జిల్లాలోని కేజీబీవీల్లో ఆరోగ్య కిట్లను పంపిణీ చేశారు. మరుసటి ఏడాది నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అందజేశారు. కరోనా వ్యాప్తితో ఆరోగ్యకిట్ల పంపిణీ అటకెక్కింది.

మూణ్నెళ్లకు ఒకసారి..

ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్యకిట్లు మూణ్నెళ్లకు ఒకసారి విద్యార్థులకు అందించాల్సి ఉంది. మాయార్న్ అండ్ ఫైబ్రిస్ అనే సంస్థ నేరుగా ఎంఈవోలకు సరఫరా చేస్తోంది. అక్కడి నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చేరుతాయి. ఆ తర్వాత విద్యార్థినులకు పంపిణీ చేసేవారు. ఇందులో బాత్‌సోప్స్–3, డిటర్జెంట్ సోప్స్–3, హెయిర్ ఆయిల్ బాటిల్–1, షాంపు బాటిల్–1, పౌడర్ డబ్బా –1, టూత్‌పేస్ట్ –1, టంకుక్లీనర్–1, దువ్వెన –1, జడ క్లిప్పులు, జడ రబ్బర్లు, బొట్టుబిళ్లల ప్యాకెట్, శానిటరీ న్యాప్‌కిన్లతో పాటు 16 రకాల వస్తువులు పంపిణీ చేశారు. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులే చదువుతుంటారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థినులు కౌమారదశలో ఉంటారు. నెలనెలా వారికి అవసరమయ్యే న్యాప్‌కిన్లు కొనలేని పరిస్థితి. దీంతో పాఠశాలకు కూడా గైర్హాజర్ అవుతుంటారు. న్యాప్‌కిన్లకు బదులు ప్రత్యామ్నాయాలు వాడుతుండడంతో ఆరోగ్య సమస్యలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతినెలా శానిటరీ న్యాప్‌కిన్లతో పాటు పలు వస్తువులతో కూడిన ఆరోగ్య కిట్లు అందించాలని నిర్ణయం తీసుకుంది.

అంతా గందరగోళం..

బాలికల ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017–18 విద్యా సంవత్సరం నుంచి ప్రతిష్టాత్మకంగా 16 రకాల వస్తువులతో హెల్త్ కిట్లు అందజేస్తోంది. గతంలో నెలకు రూ.100 చొప్పున అందజేసేవారు. తర్వాత కాలంలో విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో నగదుకు బదులు ఆరోగ్య పరిశుభ్రత కిట్లు పంపిణీ చేస్తూ వస్తోంది. కరోనా కాలం నుంచి కిట్ల పంపిణీకి బ్రేక్ పడింది. గతేడాది కిట్లకు బదులు నగదు పంపిణీకి యోచించినట్లు తెలుస్తోంది. విద్యార్థినులు బ్యాంకు ఖాతాలు తెరవాలని ఆదేశాలు రావడంతో అంతా పూర్తి చేశారు. ఏడాది గడిచిపోవడంతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు వెళ్లిపోయారు. ఈ ఏడాది కొత్తగా ఆరోతరగతిలో ప్రవేశం పొందారు. కొత్తగా ఆరోతరగతిలో చేరిన విద్యార్థినుల బ్యాంకు ఖాతాలు తెరవలేదు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులకు ఏవిధంగా చెల్లింపులు చేస్తారో తెలియకుండా పోయింది. ఆర్నెళ్లు కావస్తున్నా నగదు చెల్లింపు ఊసేలేకుండా పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక వేళ చెల్లింపులు చేసినా బ్యాంకు ఖాతాలు లేని బాలికల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినుల జాబితా అలాగే ఉండడంతో వారిని తొలగించడం ఎలాగో తెలియకుండా అంతా గందరగోళంగా మారింది. ఈలెక్కన నగదు చెల్లింపు కంటే ఆరోగ్య కిట్ల పంపిణీ సరైందని తెలుస్తోంది. దీనిపై సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తిని సంప్రదించగా బాలికలకు అందజేసే ఆరోగ్య కిట్ల సరఫరా.. స్టైఫండ్ చెల్లింపులపై ఆదేశాలు రాలేదని, పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం


దగ్ధమైన పత్తి

భీమిని(బెల్లంపల్లి): మండలంలోని తంగళ్లపల్లిలో ప్రమాదవశాత్తు పత్తిపంట దగ్ధమైంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రత్నం మల్లయ్య తన ఇంటివద్ద 30 క్వింటాళ్ల పత్తిని నిల్వ ఉంచుకున్నాడు. మంగళవారం ప్రమాదవశాత్తు పత్తికి నిప్పంటుకోవడంతో గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశారు. ఘటనలో రూ.37 వేల విలువచేసే 5 క్వింటాళ్ల పత్తి దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. తమకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

ఎస్సార్పీ 3, 3ఏ గనిలో కార్మికునికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ

శ్రీరాంపూర్ (మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 3, 3ఏ గనిలో విధుల్లో ఉన్న జనరల్ మజ్దూర్ కార్మికుడు రామకృష్ణకు ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. మంగళవారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరైన కార్మికుడు గని భూగర్భంలోని 3 సీమ్, 11 లెవల్ ఎండ్‌లెస్ వద్ద పనిచేస్తుండగా టబ్బు తాడు పుల్లీ నుంచి బయటికి వచ్చింది. దానిని పుల్లీపై చర్చే క్రమంలో తాడు బలంగా తాకడంతో గడర్‌కు కాలు ఢీకొట్టింది. ఘటనలో కార్మికుడి ఎడమ కాలు విరిగింది. వెంటనే తోటి కార్మికులు హుటాహుటిన గని ఉపరితలానికి తీసుకువచ్చి రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పులి దాడిలో మూగజీవాలు హతం


ఎద్దు కళేబరం


ఆవు కళేబరం

- సంకారం అటవీ ప్రాంతంలో ఆవు, ఎద్దుపై దాడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సంకారం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి దాడిలో రెండు మూగజీవాలు హతమయ్యాయి. గ్రామానికి చెందిన మడె అర్జయ్య, మడె పెద్ద మల్లయ్యకు చెందిన ఒక ఎద్దు, ఆవు సోమవారం పశువుల మందతో కలిసి సోమవారం మేతకు వెళ్లాయి. సాయంత్రం ఇంటికి తిరిగిరాకపోవడంతో మంగళవారం ఉదయం అటవీ ప్రాంతంలోకి వెళ్లి చూడగా ఎద్దు, ఆవు కళేబరాలు కనిపించాయి. గత నెలలో వేమనపల్లి మండలంలో సంచరించిన పులి ఇటు వైపుగా వచ్చి ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సంకారం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న మాట వాస్తవమేనని, అటవీ ప్రాంతంలోకి పశువులను తోలుకెళ్లే కాపర్లు జాగ్రత్తగా ఉండాలని ఎఫ్ఆర్వో శివకుమార్ సూచించారు. పులి దాడిలో హతమైన పశువులకు నష్ట పరిహారం ఇప్పించాలని యజమానులు కోరుతున్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


సంఘటన స్థలంలో శ్రీనివాస్

బెల్లంపల్లిరూరల్: లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోర్లకుంట శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం తన సొంత పని నిమిత్తం బెల్లంపల్లి మండలం కన్నాల జాతీయ రహదారి వైపు నడుచుకుంటూ వెళ్లాడు. రోడ్డు దాటుతున్న క్రమంలో మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించినట్లు సమాచారం. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు

- ఇంటి నంబర్‌కు రూ.50 వేలు
- ఇంటి నిర్మాణానికి రూ.లక్ష చొప్పున వసూలు


మినీ స్టేడియం సమీపంలో చేపట్టిన అక్రమ నిర్మాణం

చెన్నూర్: అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలకు చెన్నూర్ మున్సిపాలిటీ అడ్డాగా మారింది. మున్సిపల్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల అండదండలతో కొందరు వ్యక్తులు ప్రభుత్వ అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అక్రమార్కులు అట్టి స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

వందలాది ఎకరాలు అన్యాక్రాంతం

చెన్నూర్ పట్టణ సమీపంలోని గెర్రెకాలనీతో పాటు జాతీయ రహదారి పక్కన, కత్తరశాల రోడ్డులో 169, 168, 153 సర్వే నంబర్లలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. గెర్రె కాలనీలోని ప్రభుత్వ భూమిని గతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలకోసం ఇచ్చారు. అందులో కొంతమంది నిరుపేదలు ఇంటి నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్నారు. గెర్రెకాలనీ పక్కన జాతీయ రహదారి నిర్మాణం కావడంతో ఆ ప్రాంత భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో రియల్టర్లు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అమ్మకానికి తెరలేపారు. పట్టా భూముల కంటే అసైన్డ్ భూములు తక్కువ ధరకు రావడంతో చెన్నూర్‌తో పాటు కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన వందలాది మంది వాటిని కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇంటినంబర్‌కు రూ.50 వేలు

నిబంధనల ప్రకారం పట్టా భూముల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి లభిస్తుంది. ప్రభుత్వ భూముల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి లభించదు. నిర్మాణదారులు ముందుగా మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్ తీసుకుని దాని ప్రకారం నిర్మాణాలు చేపడుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూముల్లో ఇంటి నంబర్ ఇవ్వాలంటే అధికారులు రూ.50 వేలు, ఇంటి నిర్మాణానికి రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం పట్టా భూముల్లో ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని నిర్మాణం ప్రారంభిస్తే ఇంటినంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు అసైన్డ్ భూముల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టకముందే ఇంటినంబర్లు ఇచ్చినట్లు తెలిసింది.


కత్తెరశాల రోడ్డులో చేపట్టిన అక్రమ నిర్మాణం

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ఇంటినంబర్ల విషయం కూడా నా దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– గంగాధర్ మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

వినియోగదారుల ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి


మొక్క నాటి నీరు పోస్తున్న ఈశ్వరయ్య

మందమర్రిరూరల్: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఈశ్వరయ్య అధికారులను ఆదేశించారు. మండలంలోని అందుగులపేట సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సబ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. మందమర్రి విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేదికలో అధికారులు రామకృష్ణ, కిషన్, శేషారావు, కైసర్, శ్రీనివాస్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు అశోక్

మందమర్రిరూరల్: రాబోయే రోజుల్లో చెన్నూర్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేపీ నాయకుడు దుర్గం అశోక్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. చెన్నూర్ అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేయగా ఆదరించి ఓట్లు వేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై పార్టీ తరుపున ప్రజల పక్షాన పోరాటం చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వివేక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పోశం, రమేశ్, దుర్గరాజ్, కుమారస్వామి, రాయమల్లు, తిరుపతి పాల్గొన్నారు.

రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ రాజీనామా


రాజీనామా లేఖ చూపిస్తున్న గురువయ్య

దండేపల్లి: రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ మోటపల్కుల గురువయ్య తన పదవికి, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. మండలంలోని ముత్యంపేట రైతుబంధు సమితి మండల, గ్రామ కమిటీల నాయకులతో కలిసి మంగళవారం మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. ఇందుకు నిరసనగా తనతోపాటు, పలువురు రైతుబంధు సమితి సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పదవులకు, పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేసినట్లు తెలిపారు. తమ రాజీనామాలను వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. రాజీనామా చేసిన వారిలో రైతుబంధు సమితి మండల సభ్యుడు ఇప్ప రమేశ్, బీఆర్ఎస్ ముత్యంపేట గ్రామ అధ్యక్షుడు ముత్తె బాపు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మాజీ సర్పంచ్ కొట్టె సత్తయ్య, నాయకులు రమణయ్య, అప్సర్ బేగ్, అంబటిపెల్లి రవి, జీవన్, వెంకట్రాజం, పాషా, మునీర్ తదితరులు ఉన్నారు.

సంఘ విద్రోహ శక్తులకు సహకరించొద్దు

- చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్


ప్రాణహిత ఫెర్రి పాయింట్‌ను పరిశీలిస్తున్న సీఐ

వేమనపల్లి: ప్రజలు సంఘవిద్రోహ శక్తులకు సహకరించొద్దని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా కళ్లెంపల్లి గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఏదైన సమస్యలు ఉంటే 100కు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లోకి అపరిచిత , అనుమానిత వ్యక్తులు వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని కోరారు. వాహనపత్రాలు లేని 18 బైక్‌లు ఒక ఆటోను సీజ్ చేశారు. ఆయన వెంట ఎస్సై సుబ్బారావు, ఆర్ఎస్ఐ వెంకట్, పోలీసులు పాల్గొన్నారు.

హక్కులు సాధించింది ఏఐటీయూసీనే

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట(బెల్లంపల్లి): సుదీర్ఘ కాలంగా సింగరేణి కార్మికులకు హక్కులు సాధించించి ఏఐటీయూసీ మాత్రమేనని యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ విఠల్‌రావు ఎంపీగా ఉన్న సమయంలో దీపావళి బోనస్‌ను సాధించామన్నారు. కంపనీలో లాభాల వాటా సాధించింది కేఎల్ మహేంద్ర అన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ సింగరేణిని కాపాడుకుందామన్నారు. నిత్యం కార్మికుల కోసం ఉద్యమించే ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, మందమర్రి, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేశ్, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, నాయకులు దాసరి తిరుపతి, మీనుగు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, రాంచందర్, శ్రీహరి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.